# సమానత్వం ఒక ప్రజాస్వామిక హక్కు

## దళితులకు, స్త్రీలకు, వెనుకబడిన కులాలకు, గిరిజనులకు
## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి!

ప్రజలారా !

భారతదేశంలో కులవ్యవస్థ చేత, పురుషాధిక్య సామాజిక వ్యవస్థ చేత అణచివేయబడ్డ ప్రజానీకం సమాన ప్రతిపత్తికోసం, సమాన అవకాశాల కోసం జరిపిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా విద్యాఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కొంత మేరకు కల్పించడం జరిగింది. ఇవి బ్రిటిష్ పాలనా కాలంలోనే కొన్ని రాష్ట్రాలలో మొదలయ్యాయి. స్వాంతంత్ర్యానంతరం కొనసాగాయి, విస్తృతం అయ్యాయి.

ప్రభుత్వ ఉద్యోగాలలోనయినా వేరే ఏ విషయంలోనయినా కులం, జాతి, ప్రాంతం, లింగం, మతం అనే వివక్షకు స్థానం ఉండడానికి వీలులేదని భారత రాజ్యాంగం ఆర్టికల్స్ 15,16లలో అంటుంది. ఇవి ప్రాథమిక హక్కుల జాబితాలో ఉన్నాయి. అంటే సంప్రదాయ బ్రాహ్మణీయ 'ధర్మం' ఇకమీదట చెల్లదని, అది రాజ్యంగ విరుద్ధమని, భారత రాజ్యాంగం అంటుంది.

వివక్షత చెల్లదని ప్రకటిస్తే సరిపోదు. దానిని సామాజిక వ్యవస్థనుండి పూర్తిగా పెకిలించివేసి అందరికీ సమాన ప్రతిపత్తినీ సమాన అవకాశాలనూ కల్పించాలి. ఇదొక సామాజిక ఆర్థిక రాజకీయ కృషి. ఒక మౌలిక ప్రజాతంత్ర కృషి. అయితే ఇది రాజ్యాంగం చేసి పెట్టగల పనికాదు. రాజ్యాంగం చేయగలిగినది ఈ కృషికి అవసరమైన హక్కులనూ అధికారాలనూ సూత్రాలనూ ప్రమాణాలనూ ప్రతిపాదించడం మాత్రమే.

ఆర్టికల్స్ 15,16లలో కులం, లింగం, మతం జాతి తదితర వ్యవస్థీకృత వివక్షతలు చెల్లవని ప్రకటించిన భారత రాజ్యాంగం, ఆ అసమానత్వాన్ని పాగొట్టడానికి దోహదపడే ప్రత్యేక చర్యలు చేపట్టే అవకాశాన్ని కూడ ప్రభుత్వానికి ఇచ్చింది. 'సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం' భారత రాజ్యాంగలక్ష్యం కాబట్టి ఆ అవకాశాన్ని ప్రభుత్వం తనకు బుద్ధిపుడితే ఉపయోగించుకోవచ్చుననీ లేకపోతే లేదనీ వాదించడానికి వీలులేదు. వాటిని ప్రభుత్వం క్రియాశీలకంగా ఉపయోగించుకొని సాంఘిక ఆర్థిక అసమానతలను ప్రయత్నపూర్వకంగా పోగొట్టాలి. రాజ్యాంగం ప్రభుత్వానికి ఇచ్చిన ఈ అవకాశాలు నిజానికి వివక్షకూ పీడనకూ గురిఅయిన ప్రజల హక్కులు. అవి కేవలం ప్రభుత్వం అధికారాలు కావు. ఆ హక్కులు వారికి దక్కేటట్లు చూడడం ప్రభుత్వం బాధ్యత. జాతి జీవన వ్యవస్థలన్నిటిలోనూ 'సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం' నెలకొనేటట్టు విధానరచన చేయడం ప్రభుత్వం బాధ్యత అని భారతరాజ్యాంగంలోని ఒక ముఖ్య ఆదేశిక సూత్రం అయిన ఆర్టికల్ 38 అంటుంది. తరతరాలుగా అన్యాయానికి గురయిన పీడితకులాలకూ, ఆదివాసీలకూ, స్త్రీలకూ న్యాయం చేకూర్చే అధికారాన్ని ప్రభుత్వం తగురీతిలో వినియోగించుకొని తీరాలి. దళితులు, ఆదివాసీల (రాజ్యాంగ పరిభాషలో షెడ్యూల్డుకులాలు, తెగల) విషయంలోనయితే ఏ అనుమానానికీ ఆస్కారం మిగిలించకుండ, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో ఆ వర్గాల అవసరాలను తప్పనిసరిగా లెక్కలోకి తీసుకోవాలని ఆర్టికల్ 335 స్పష్ట చేస్తుంది.

ఈ హక్కులూ, అవకాశాలూ రాజ్యాంగంలో ఉన్నాయంటే దానికి కారణం పీడితులు చేసిన ఆందోళనలు, పోరాటాలే. అవి నిజంగా అమలుకావాలన్నా లేక మరింత విస్తృతం కావాలన్నా

పోరాటాలు అవసరమే. దళితులు, స్త్రీలు, ఆదివాసీలు స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత అనేక ఉద్యమాలు చేసారు. చట్టసభలలోనూ బయటా చేసారు. వాటి ఫలితంగా విద్యాఉద్యోగ రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు, ఆర్థికపురోభివృద్ధికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు, సబ్సిడీలు, సులభరుణాలు మొదలైనవి ప్రభుత్వ విధానాలలో చోటుచేసుకున్నాయి. దళితులు, ఆదివాసీలతో మొదలుపెట్టి కాలక్రమంలో వెనుకబడిన కులాలకూ, స్త్రీలకూ ఇవి కొంత మేరకు విస్తరించాయి. కేంద్రప్రభుత్వం అధీనంలో ఉన్న విద్య ఉద్యోగ రంగాలలో వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు మండల్ కమీషన్ ద్వారా ఈ మధ్యనే లభించాయి. దాని కోసం దేశరాజకీయ సామాజిక రంగాలలో జరిగిన సంఘర్షణను మనమింకా మరచిపోలేదు. స్త్రీల విషయంలోనయితే ఒక జాతీయ విధానమేదీ లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యనే విద్యాఉద్యోగ రంగాలలో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లు ప్రకటించింది. చట్టసభలలో దళితులకు, ఆదివాసీలకే తప్ప స్త్రీలకు, వెనుకబడిన కులాలకూ రిజర్వేషన్లు లేవు. నూతన పంచాయతి రాజ్ వ్యవస్థ మాత్రం పంచాయతిరాజ్ పదవులలో వారికి రిజర్వేషన్లు కల్పించింది.

అయితే రాజ్యాంగం 'ఇకపైన చెల్లదు' అని ప్రకటించిన బ్రాహ్మణీయ వర్ణవివక్ష, స్త్రీపురుష అసమానత సమాజంలో బలంగా వ్యవస్థితమయి ఉన్నాయి కాబట్టి సమానత్వ సాధన చట్టాలలో, ప్రభుత్వ విధానప్రకటనలో కనిపించినంతగా వాస్తవానికి పురోగమించలేదు. ఆధిపత్యం వల్ల ప్రయోజనం పొందేవారు పురోగమించనివ్వరు. ఉద్యోగరిజర్వేషన్లలో 'బ్యాక్‌లాగ్' పోస్టులు దండిగా ఉన్నాయి. 'బ్యాక్‌లాగ్' అన్నమాట ఉపయోగించడం వల్ల అవి కాకతాళీయంగా నిండకుండ ఉండిపోయాయన్న ధ్వని ఉంటుంది. కొన్ని సందర్భాలలో నిజంగానే ఆయా పీడిత కులాలలో ఆఉద్యోగానికి కావలసిన డిగ్రీలు, అనుభవం గలవారు దొరకకపోవచ్చును. కానీ ఎక్కువభాగం ఇవి నిండకుండ ఉండిపోయినవి కావు. నింపకుండ ఉండిపోయినవి. వాటిని నింపకుండ మిగుల బెట్టడానికి ఆధిపత్య కులాలవాళ్ళు అనేక ఎత్తు గడలు అవలంబిస్తుంటారు. ప్రభుత్వశాఖల కంటే విద్యాసంస్థలలో ఇది ఎక్కువగా ఉంది. ప్రభుత్వం 'ఎయిడ్' ఇచ్చే విద్యాసంస్థలు, ప్రభుత్వం మంజూరు చేయని ఉపాధ్యాయ పోస్టలను అడ్వర్ట్‌జ్‌మెంట్ లేకుండా రోస్టర్ ప్రమాణాలు పాటించకుండ, పార్ట్‌టైం లేక అడ్‌హాక్ పోస్టులుగా తమ సన్నిహితులకు, ఆశ్రితులకు ఒక్కొకసారి డబ్బులు ముట్టజెప్పిన వారికి ఇచ్చి వారికి 'హక్కులు' కల్పిస్తారు. తమ క్వాలిఫికేషన్స్ మెరుగుపరచుకునే అవకాశం కల్పిస్తారు. చివరికి ఆపోస్టు రెగ్యులరైజ్ అయినప్పుడు అప్పటికే సర్వీస్‌లో ఉన్నారని చెప్పి వారికే ఇప్పిస్తారు.

పంచాయతి రాజ్ వ్యవస్థలో రిజర్వ్ పోస్టులలో ఎన్నికయ్యేది ఒకరయితే పెత్తనం చేసేది ఇంకొకరు. సర్పంచ్ దళితుడయితే ఉపసర్పంచ్ అయిన అదిపత్యకులస్తుడే అసలు సర్పంచ్ అవుతాడు. సర్పంచ్ స్త్రీ అయితే ఆమెభర్తే సర్పంచ్ కుర్చీలో కూర్చుంటాడు. ఆర్థిక రంగంలో కల్పించిన సబ్సిడీలు, రుణాలు, ప్రత్యేక సదుపాయాలు కూడ బేనామీగా, బలవంతంగా, బలవంతుల పాలవుతున్నాయి.

సమానత్వం దిశగా సాధించుకున్న చట్టపరమైన హక్కులను వాస్తవంగా పొందడానికి పీడితులు మళ్లీ పోరాటం చేయవలసి ఉంటుందని దీనిని బట్టి అర్థం అవుతుంది. ఇది ఒక్క రిజర్వేషన్ల విషయంలోనే కాక అన్ని హక్కులకూ వర్తిస్తుందనేది పౌరహక్కుల ఉద్యమం అనుభవం.

అయితే ఇదంతా ఒకెత్తయితే, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు ఒకెత్తు. ఇప్పటివరకు పీడిత కులాలు, ఆదివాసీలు, స్త్రీలు వ్యక్తం చేసిన ఆకాంక్షలకు ఈ మాత్రమైనా స్పందన రావడానికి గల కారణం 'సామాజిక ఆర్థిక రాజకీయ' న్యాయం సాధించడంలో ప్రభుత్వానికి గల బాధ్యతను గుర్తించడం, దానికోసం ప్రభుత్వం చేపట్టవలసిన కర్తవ్యాలను గుర్తించడం. ఇప్పుడు ఈ గుర్తింపే

పక్కకుపోతూ ఉంది. పెట్టుబడి దారులకు అవసరమైన సదుపాయాలు కల్పించే బాధ్యత పోలీసు వ్యవస్థను సమర్థంగా నడిపే బాధ్యత ఇవి తప్ప ప్రభుత్వానికి సమాజంపట్ల వేరే బాధ్యతలేవీ లేవనేది ప్రస్తుతం అంతర్జాతీయంగానే ఆధిపత్య స్థానంలో ఉన్న దృక్పథం. ఇదే ఈ రోజు భారత ప్రభుత్వం దృక్పథం. దీనిని అమలుచేసే క్రమంలో సామాజిక న్యాయాన్ని సాధించే బాధ్యతను, ఆర్థిక సాంఘిక రంగాలలో నిర్వహించవలసిన కర్తవ్యాలను, ప్రభుత్వం ఒకటొకటిగా వదులుకుంటూ ఉంది. గతంలో ప్రభుత్వం నిర్వహించిన కర్తవ్యాలు ఒకటొకటిగా ఇప్పుడు ప్రైవేట్‌పరం అవుతున్నాయి. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, కీలకపరిశ్రమలు, రవాణావ్యవస్థ, ప్రైవేట్ పెట్టుబడి దార్ల లాభాల వేటకు వేదికలవుతున్నాయి.

దీనివల్ల రాగల అనేక దుష్ఫలితాలు అటుంచి, విద్యా ఉద్యోగరంగాలో దళితులు, ఇతర పీడితకులాలు, ఆదివాసీలు, స్త్రీలు ఇప్పటిదాకా సాధించుకున్న రిజర్వేషన్ హక్కుకు పునాది ఎగిరిపోతుంది. మళ్లీ చాతుర్వర్ణం విద్యాఉద్యోగ రంగాలలో నెలకొనే పరిస్థితి పునరావృతం అవుతూఉంది. స్త్రీలు మళ్లీ వంటింట్లోకి, దళితులు అసంఘటిత కార్మిక రంగంలోనికీ నెట్టబడే రోజులు తిరిగి వస్తున్నాయి. ఇప్పటికి ఈ విషయంలో సాధించుకున్న పాక్షికమైన ప్రజాస్వామిక ప్రగతికి ఇది గొడ్డలి పెట్టు.

ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలు ప్రస్తుతం ఎవరి గుప్పిట్లో ఉన్నాయన్న విషయాన్ని పరిశీలిస్తే, రేపు సమాజ వ్యాప్తంగా రాబోయే పరిస్థితి కొంత అర్థం అవుతుంది. పౌరహక్కులసంఘం హైదరాబాదు, వరంగల్, నెల్లూరు, కృష్ణ, పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లలోని 13 ప్రైవేట్ విద్యాసంస్థలలో ఈ పరిశీలన జరిపింది. ఆ 13 విద్యాసంస్థలలోని 376 మంది ఆధ్యాపకులలో 310 మంది బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి తదితర ఆధిపత్య కులాలకు చెందినవారు. 54 మంది బి.సి. కులాలవారు, 11మంది షెడ్యూల్డు కులాలవారు కాగా 1 వ్యక్తి మాత్రమే షెడ్యూల్డు తెగకు చెందిన వాడు. 376 మందిలో 60 మంది మాత్రమే స్త్రీలు. మళ్లీ స్త్రీలకు కొంత ఉద్యోగ అవకాశాలుండేది అధ్యాపకరంగంలోనే !

విద్యా సంస్థలలోని అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బందిని (ప్రొఫెసర్ల నుండి స్వీపర్లదాకా) తీసుకుంటే చాతుర్వర్ణం నమూనయే కనిపిస్తుంది. వరంగల్‌లోని కాకతీయ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్‌సైన్స్‌ను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చును.

| | ఎస్‌సి,ఎస్‌టి | బిసి | ఆదిపత్యకులాలు | మొత్తం |
|---|---|---|---|---|
| అధ్యాపకులు, ఆఫీసర్లు, ఆఫీసు సూపరింటెండంట్లు | - | 4 | 65 | 69 |
| గుమాస్తాలు, స్టెనోలు | 1 | 3 | 17 | 21 |
| టెక్నికల్, సపోర్టింగ్ సిబ్బంది, డ్రైవర్లు, అటెండర్లు, వాచ్‌మెన్, కాంపౌండర్లు | 9 | 49 | 17 | 75 |
| మాలీలు, స్వీపర్లు | 10 | 1 | - | 11 |

ప్రైవేట్‌పారిశ్రామిక రంగంలోని పరిస్థితి ఇంతకంటే భిన్నంగా లేదు. విశాఖపట్నంలోని కొరమాండల్ ఫెర్టిలైజర్స్‌ను ఉదాహరణగా తీసుకుంటే అందులోని 400 మంది సూపర్‌వైజర్, టెక్నికల్ సిబ్బందిలో గిరిజనులొక్కరూ లేరు. బిసికులాలవారు 35 మంది, దళితులు 18 మంది మాత్రం ఉన్నారు. మిగిలిన 347 మంది ఆదిపత్య కులాలవారే. ఉద్యోగహోదా తగ్గే కొద్దీ ఎస్.సి, బిసి కులాల వారి సంఖ్య పెరుగుతుంది. అయితే స్త్రీలు మాత్రం కొరమాండల్‌లోని 635 మంది సిబ్బందిలో ఇద్దరే ఇద్దరు! గిరిజనులు ఒక్కరూ లేరు. కడప జిల్లా యెర్రగుంట్లలోని జువారిసిమెంట్ ఫ్యాక్టరీలో మేనేజర్లు, గుమాస్తాలు కలిసి 103 మంది ఉంటే అందులో ఆదిపత్యకులాలు 87 మంది ఉన్నారు. 12 మంది బిసి కులాలకు చెందినవారు, ముగ్గురు దళితులు, ఒక్కగిరిజనుడు ఉన్నారు. అయితే ఫ్యాక్టరీలోని మొత్తం 149 మంది సిబ్బందిలో (పర్మనెంట్ కార్మికులను కలుపుకొని) ఒక్క స్త్రీకూడ లేదు. ప్రైవేట్ పారిశ్రామిక రంగంలో స్త్రీలస్థానం అన్నిచోట్ల ఇదే మోతాదులో కనిపిస్తుంది. కర్నూలు జిల్లా ఆదోనిలోని రాయలసీమ స్పిన్నింగ్ మిల్లులోని 61 మంది సిబ్బందిలో ఇద్దరు మాత్రమే స్త్రీలు. కాజువల్, కాంట్రాక్టు కార్మికులను, అసంఘటిత రంగాన్నీ లెక్కలోకి తీసుకుంటేనే స్త్రీలు కనిపిస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే మన సాంఘిక వ్యవస్థలోని అసమానత, ఆధిపత్యం, ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలలో ప్రతిఫలిస్తుంది. దేశవిధానాలలో ప్రైవేటీకరణ పెరిగే కొద్దీ ఈ అప్రజాస్వామిక స్థితి మరింతగా విస్తరిస్తుంది. దీనిని ఎదుర్కొనే ప్రజాతంత్ర కర్తవ్యం ప్రగతికాముకులందరి మీదా ఉంది. కనీసం ఈనాడు ప్రభుత్వరంగంలో ఉన్న రిజర్వేషన్లను ప్రైవేట్ రంగానికి కూడ వర్తింపజేయనిదే ఇప్పటికి సాధించుకున్న ప్రగతిని కూడ కాపాడుకోలేము.

## సదస్సు

సెప్టెంబర్ 15 ఉదయం 10గంటలనుండి సాయంత్రం దాకా
వరంగల్‌లోని చేంబర్ ఆఫ్ కామర్స్ హాల్, గ్రెయిన్ మార్కెట్ దగ్గర
(వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో)

వక్తలు: ప్రొఫెసర్ గోపాల్ గురు (పూణె విశ్వవిద్యాలయం)

ప్రొఫెసర్ కె.యస్.చలం (ఆంధ్ర యూనివర్సిటి, విశాఖపట్నం)

డా॥ గిరిజారాణి (లెక్చరర్, వరంగల్)

ప్రొఫెసర్ ఎస్.శేషయ్య (ఎస్.కె యూనివర్సిటీ, అనంతపురం)

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కులసంఘం
**APCLC**